ప్రజాశక్తి

శనివారం 1 మార్చి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అరకొర కేటాయింపులు

- కృష్ణా డెల్టాకు మొత్తం రూ.701 కోట్లు
- గోదావరి, పెన్నా నదుల అనుసంధానానికి రూ.200 కోట్లు
- పులిచింతలకు రూ.16.37 కోట్లు
- రాజధాని అమరావతికి రూ.6 వేల కోట్లు
- వరికపూడిసెలకు మళ్లీ మొండిచేయి
- గుంటూరు ఛానల్‌కు నిధులపై అస్పష్టత



గుంటూరు ఛానల్ విస్తరణ కోసం సర్వే (ఫైల్)

వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రతిపాదించిన రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు చాలా తక్కువగానే ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేటాయింపుల్లో ప్రధానంగా అమరావతికి, నీటి పారుదల రంగానికి కేటాయింపులు దక్కాయి. వీటిల్లో అమరావతికి ఇప్పటికే రూ.24 వేల కోట్లతో టెండర్లు పిలిచారు. మొత్తం రూ.44 వేల కోట్లతో పనులు ప్రతిపాదించారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.6 వేల కోట్ల మేరకు పనులు పూర్తవుతాయని అంచనావేసి ఆ మేరకు నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. మూడేళ్ల కాలపరిమితిలో రూ.45 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించినా తొలి ఏడాది రూ.6 వేల కోట్లతో సరిపెట్టారు. నీటి పారుదల రంగానికి కూడా కేటాయింపులు పెద్దగా పెరగలేదు. ప్రధానంగా

▶ 2లో

ఆల్ ద బెస్ట్

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- హాజరు కానున్న 71,528 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు



ఇంటర్ విద్యార్థులకు నేటి నుండి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం పరీక్షా కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. విభజిత గుంటూరు జిల్లాలో 87 పరీక్షా కేంద్రాల్లో 71,528 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 34,473 మంది, ఒకేషనల్ 1,215 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 34,973 మంది, ఒకేషనల్ 867 మంది ఉన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారు. కాగా ఉదయం 8.30 గంటల నుంచే కేంద్రంలోకి అనుమతిస్తారు. 9 గంటల తర్వాత అనుమతి ఉండదని ఆర్‌ఐఒ జి.కె.జుబేర్ స్పష్టం చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని అధికారులు చెప్పారు. ప్రశ్నాపత్రం తెరిచే గదిసహా, ఆన్సర్ షీట్లను ప్యాక్ చేసే గదిలోనూ సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికి ఇంటర్‌బోర్డు హాల్‌టిక్కెట్టు జారీ చేసింది. హాల్ టిక్కెట్లను బోర్డువైబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని, సంతకం లేదని ఎవరైనా అనుమతించకపోతే సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌పై కఠిన చర్యల ఉంటాయని ఆర్‌ఐఒ స్పష్టం చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌ను నిరోధించేందుకు 4 ఫ్లయింగ్, 4 సిట్టింగ్ స్క్వాడ్‌లు నియమించారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు, సందేహాల నివృత్తికి ఆర్‌ఐఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబరు 0863-2228528కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

అప్పుల ఊబిలో దించే బడ్జెట్

వై.నేతాజి, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి

బడ్జెట్ మొత్తం అంకెల గారడీయే

గుంటూరు విజయకుమార్ , సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి

చంద్రబాబుకు, జగన్‌కు తేడా ఏముంది

జంగాల అజయ్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి

సంక్షేమం లేకుండా తొలి ఏడాది పూర్తి

షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు

కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేదు

చంద్రగిరి ఏసురత్నం, వైసిపి ఎమ్మెల్సీ

అమరావతి, పోలవరం పూర్తికి ప్రాధాన్యం

ధూళిపాళ్ల నరేంద్ర, పొన్నూరు ఎమ్మెల్యే

అభిప్రాయాలు.. 2వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలి

పోలింగ్ 80 శాతం దాటిన కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా



విలేకర్లతో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు నేతాజి, విజయ్‌కుమార్ తదితరులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ తీవ్రమైన అక్రమాలకు పాల్పడిందని, వీటిపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. పోలింగ్ 80 శాతం దాటిన కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు, నాయకులు శుక్రవారం గుంటూరు, నరసరావుపేటల్లో విలేకర్లతో మాట్లాడారు. గుంటూరు బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, కె.నళినీకాంత్, ఈమని అప్పారావు మాట్లాడుతూ.. పిడిఎఫ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లో కూర్చోవద్దంటూ పోలింగ్ ముందు రోజు నుండే బెదిరించారని, కొన్ని చోట్ల బూత్‌లలో నుండి బయటకు లాగేశారని అన్నారు. ఇంకొన్ని చోట్ల డబ్బులతో ప్రలోభ పెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. గుంటూరు, మంగళగిరి పలు చోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద పిడిఎఫ్ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగారన్నారు. పోలింగ్‌కు ముందు రోజు కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి, ఎన్ఆర్ఐ విద్యార్థులతో పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల క్యాంపెయిన్ చేపట్టినా యంత్రాంగం పట్టించుకోలేదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు అనేకచోట్ల బూత్‌లలోకి వెళ్లారని, హిందూ కాలేజీలో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే బి.రామాంజనేయులుకు అభ్యంతరం చెప్పిన పిడిఎఫ్ ఏజెంట్‌ను బెదిరించారన్నారు. పథకం ప్రకారం దొంగ ఓట్లు వేశారని, యంత్రాంగం కూడా అనేక చోట్ల అధికార పార్టీకి సహకరించిందని, గుర్తింపు కార్డులు చూడకుండానే ఓటుకు అనుమతించారని వివరించారు. పిడిఎఫ్ ఏజెంట్లు అభ్యంతరం తెలిపినా పోలింగ్ అధికారులు పట్టించుకోలేదన్నారు. గుంటూరులో, తెనాలిలో కౌన్సిలర్లు ఇష్టానుసారం పోలింగ్ బూత్‌లలోకి ప్రవేశించారని, గుంటూరులోని ఒక బూత్‌లో ఒకే ఓటరుకు ఒకటి కంటే ఎక్కువ బ్యాలెట్లు ఇచ్చారని చెప్పారు. తెనాలిలో పోలింగ్ కేంద్రం ఆవరణలో ముఠాలు ఉండి వేలిపై ఉన్న ఇంకును అక్కడిక్కడే తుడిపి వేసి మళ్లీ ఓటు వేయించారన్నారు. అనేక సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తే ఎవరెవరు

▶ 2లో



డ్రగ్స్ రహిత పల్నాడుగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డ్రగ్స్ రహిత పల్నాడు జిల్లాగా రూపుదిద్దేందుకు అందరూ కృషి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయం, ఉమ్మడి భాగస్వామ్యంతో డ్రగ్స్ జాడ్యంపై పోరాటం చేయాలన్నారు. బాలలు - మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలపై పోలీసు శాఖ, విద్యా శాఖ, ఎక్సైజ్ శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, పంచాయతి రాజ్ శాఖ, సమాచార-పౌర సంబంధాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య,ఆరోగ్య శాఖ, రైల్వే మొదలగు శాఖలకు ఉన్నతాధికారులతో ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు డ్రగ్స్ నియంత్రణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఔషధ, మద్యం దుకాణాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, మద్యం దుకాణాలు పాఠశాలలకు దూరంగా

▶ 2లో

అప్పుల ఊబిలో దించే బడ్జెట్

వై నేతాజీ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కష్టజీవులను విస్మరించింది. రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి దించే బడ్జెట్ తప్ప, ప్రజలకు భారాల నుండి విముక్తి లేని బడ్జెట్ రూ.3.22 లక్షల కోట్లలో లక్ష కోట్ల రూపాయలకు పైగా అప్పులు తేవాలని ప్రతిపాదించారు. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్రం మరింత అప్పుల్లోకి పోయే ప్రమాదం వుంది. రాజధాని అభివృద్ధికి తగిన నిధులు ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని. కానీ బడ్జెట్ ప్రసంగంలో ఆ ప్రస్తావనే లేదు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల సంక్షేమం కోసం ఏమి లేదు. ఇళ్ళులేని పేదలందరికీ ఇళ్ళ స్థలాలు మంజూరుకు నిధులు కేటాయింపు లేదు. ధర లేక మిర్చి రైతులు దివాళా తీస్తుంటే వారిని ఆదుకోవటానికి ధరల స్థిరీకరణ నిధులు కేటాయింపు జరగలేదు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలు, కనీస వేతనాలపై నిర్ణయం అమలు ఊసే లేదు. పిఆర్‌సి, ఐ.ఆర్, ఓ.పి.యస్ వాటి గురించి మాట్లడలేదన్నారు. స్కీమ్ వర్కర్స్ సమస్యలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, అసంఘటిత కార్మికుల సంక్షేమం ఊసేలేదన్నారు.గుంటూరు ఛానల్ విస్తరణకు ఎన్నికల హామీ తప్ప ఈ బడ్జెట్‌లోనూ నిధులు ఇవ్వలేదు. పంట కాల్వల ఆధునీకరణకు నిధులు కేటాయించలేదు.

చంద్రబాబుకు, జగన్‌కు తేడా ఏముంది

జంగాల అజయ్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు అతీగతి లేదు. దిశానిర్దేశం లేదు. లెక్కలు ఫుల్, ఖజానా నిల్ అన్నట్టుగా ఉంది. ప్రజల్ని మభ్యపెట్టడానికి పెద్ద ప్రయత్నం జరిగింది. రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లు, ద్రవ్య లోటు రూ.79, 926 కోట్లు ఎలా పూడుస్తారు... అప్పులు చేస్తారా..? గత ప్రభుత్వం రూ.4.21 లక్షల కోట్లు అప్పులు చేసిందని బడ్జెట్‌లో చెప్పారు. మరిప్పుడు రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేస్తున్నారని, ఇక జగన్‌కు, చంద్రబాబుకు మధ్య తేడా ఏముంది. వ్యవసాయ రంగానికి, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. సాగునీటికి రూ.32వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.11,314 కోట్లే కేటాయించారు. సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేశారు.

కష్టజీవులకు చోటులేని బడ్జెట్

బడ్జెట్‌పై నేతల భిన్నాభిప్రాయాలు

రాష్ట్ర బడ్జెట్‌పై వివిధ రాజకీయ పార్టీల జిల్లా నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. 2025-26కి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులు అంకెల్లో చూపినా వాస్తవిక పరిస్థితులు అందుకు భిన్నంగాఉంటున్నాయి. 2024-25లో చేసిన కేటాయింపులు ఏవీ ఎక్కడా అమలు అయిన దాఖలాలు లేవని కేవలం కాగితాలకేపరిమితం అయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. వామపక్షాలు, టిడిపి, వైసిపి, కాంగ్రెస్ నాయకుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

అమరావతి, పోలవరం పూర్తికి ప్రాధాన్యత

ధూళిపాళ్ల నరేంద్ర, ఎమ్మెల్యే పొన్నూరు



అమరావతి నిర్మాణానికి , వ్యవసాయ రంగ అభివృద్ధి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ పోలవరం త్వరగా పూర్తిచేయాలన్న లక్ష్యంతో బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు ఉన్నాయి. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించినా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్ నిర్మాణానికి బలమైన ఆర్థిక ప్రణాళికలతో బడ్జెట్ ఉంది. ఉపాధి, ఉద్యోగ వ్యవసాయ రంగాలు, అన్ని ప్రాంతాలు అభివృద్ధికి బడ్జెట్ రూపకల్పన చేశారు.

కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేదు

చంద్రగిరి ఏసురత్నం, వైసిపి ఎమ్మెల్సీ



రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చూపలేదు. గత ఏడాది నవంబరులో 2024-25లో పలు పథకాలకు కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదు. 50 ఏళ్లకే బిసిలకు పింఛన్లు ఇస్తామని ఇంత వరకు ఆ ఊసే ఎత్తడంలేదు. 18 ఏళ్లపైబడిన మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణంపై కేటాయింపులు లేవు. బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా ఉన్నా ప్రజలకు వొనగూరే ప్రయోజనం స్వల్పమేనని అభిప్రాయపడ్డారు.

బడ్జెట్ మొత్తం అంకెల గారడీయే

గుంటూరు విజయకుమార్ , సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి



కూటమి ప్రభుత్వం మొట్టమొదటగా పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కేవలం అంకెల గారడీలా ఉంది. బడ్జెట్‌లో అన్ని విధాలా వెనుకబడిన పల్నాడుకు తీవ్ర అన్యాయం జరిగింది. ఎన్నికల హామీల అమలుకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకోలేదు. పల్నాడు ప్రజలను ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న వరికపూడిశెల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ లకు గుర్తురాలేదా. కొత్త జిల్లా అవసరాలు మౌళిక సదుపాయాల కల్పన, మూలన పడిన లిఫ్ట్ ఇరిగేషన్లకు మరమ్మతుల నిధుల, ఉపాధి హామీ పథకం, రైతులకు, కౌలు రైతులకు బడ్జెట్లో ఊసేలేదు. పరిశ్రమల స్థాపనకు పల్నాడు భూములు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యంతోనే పల్నాడు వెనుక బడింది. రాజధాని నిర్మాణానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి పూర్తి స్థాయిలో రాజధాని అభివృద్ధి చేయాలి. సూపర్ సిక్స్ ప్రజలను నమ్మించి మోసం చేశారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడి సాయానికి కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం బడ్జెట్ పై పునరాలోచించాలి.

సంక్షేమం లేకుండా తొలి ఏడాది పూర్తి

షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మేడిపండును పోలి ఉంది. 2024లోనే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాటు సంక్షేమ పథకాలను పక్కన పెట్టింది. 2025 మే నెల తరువాత తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. గత ఏడాదిలో ఇవ్వాల్సిన ఈ రెండు పథకాలు ఇంత వరకు ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారు. 2024-25లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా ఇలాగే కేటాయింపులు చేసి తరువాత ప్రజలకు మొండిచేయి చూపారు. గత బడ్జెట్‌లో కేటాయింపులలో పేదలకు అందిన ఫలితాలు శూన్యం, మొక్కుబడి అభివృద్ధి, సంక్షేమం ఊసే లేకుండా కూటమి పాలన సాగుతుంది.

(ప్రజాశక్తి- గుంటూరు జిల్లాప్రతినిధి, గుంటూరు, పల్నాడు)

నిరుద్యోగులకు మొండిచేయి

డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్, వై.కృష్ణకాంత్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపాధి రహిత బడ్జెట్. నిరుద్యోగులకు మొండిచేయి చూపిం చింది. ఎన్నికల ముందు అధికారం లోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా కనీసం బడ్జెట్‌లో ప్రస్తా వన కూడా చేయలేదన్నారు. గెలిచిన తర్వాత డి.ఎస్సీ మీద పెట్టిన మొదటి సంతకం మాటలకే పరిమితమయ్యిందన్నారు. గ్రూప్-2 అభ్యర్థులు పెద్దఎత్తును ఆందోళన చేసినా రోస్టర్ విధానంపై, ఖాళీల భర్తీని పూర్తిగా మరిచారు. ప్రతి ఏటా డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువత నిరుద్యోగులుగా మారుతున్నారు. వీరికి ఉద్యోగాల కల్పన ప్రస్తావనే లేదు.

బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు ప్రాధాన్యం : నిమ్మల

ప్రజాశక్తి - మంగళగిరి

బడ్జెట్‌లో ఇరిగేషనకు అధిక ప్రాధాన్యత ఉందని జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శు క్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా మంగళగిరి పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ప్రారంభించి అనంతరం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఇరిగేషన్‌కు నాడు ఎన్టీఆర్ ఎంత ప్రాధాన్యత ఇచ్చారో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేసేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కరువు రహితంగా ఉండాలనే సదుద్దేశ్యంతో బడ్జెట్‌లో అధిక నిధులను ఇచ్చారన్నారు. ఖచ్చింతగా పోలవరం 2027 డిసెంబర్ కు ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం షెడ్యూల్ ప్రకారం డయాఫ్రం వాల్ పూర్తి చేసి ప్రాజెక్ట్ ను పూర్తి చేసి ఇటు ఉత్తరాంధ్రకు ఇటు రాయలసీమకు నీళ్ళ తీసుకుని వస్తామని తెలియజేశారు. రాయలసీమకు లైఫ్ లైన్ లాంటి హంద్రీనీవా ప్రాజెక్టుకు 4వేల కోట్లు బడ్జెట్ లో కేటాయింపు చేయటం జరిగిందని, రాయలసీమను రత్నాల సీమ చేయటమే తమ ప్రభుత్వం ధ్యేయం అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో వెనుక బడిన జిల్లా అయిన ప్రకాశం జిల్లాలో ఫ్లోరైడ్ నీటిని కాకుండా తాగు నీరు అందించేందుకు వెలిగొండ పూర్తి చేస్తామని, చింతలపూడి గతంలో వైసీపీ ప్రభుత్వంలో తప్పిదంతో నిలిచిపోయింది. చంద్రబాబు విజనరి 2047 ఏర్పెటే ఉందో దాన్ని నిర్దేశిత సమయం పెట్టుకుని ఈ ప్రాజెక్టులపై పనిచేస్తున్నామని తెలిపారు

డ్రగ్స్ రహిత పల్నాడుగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

తరలించాలని చెప్పారు. విద్యాసంస్థల్లో క్యాంపస్ క్లబ్స్ ఏర్పాటు ద్వారా పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి కమిటీ సమావేశాలు జరపాలని విద్యాశాఖను ఆదేశించారు. డ్రగ్ నియంత్రణకు ప్రత్యేక కౌన్సిలింగ్ విధానాలు, పునరావాస కేంద్రాలు, డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. హాస్టళ్లలో మనస్తత్వ నిపుణుల అవసరంపై ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. స్కూల్స్, కాలేజీల దగ్గర ప్రత్యేక నిఘా పెట్టడం, బాలలకు సంబంధించిన ప్రత్యేక విభాగం ఎస్‌జెపియు ద్వారా బాలలకు సంబంధించిన హక్కులకు భంగం వాటిల్లకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. తప్పిపోయిన, వదిలివేయబడిన బాలలను బాలల సంక్షేమ కమిటీ వారి ముందు ప్రవేశపెట్టి వారికి సంబంధించిన విషయాలను వెబ్‌సైట్ ద్వారా రైల్వే పోలీసులు సమాచారం ఇవ్వాలన్నారు. పిల్లలతో మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వ్యక్తుల ముఠాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఔషధ నియంత్రణాధికారులు మత్తును కలిగించే వివిధ ఔషధాలను పిల్లలకు అమ్మకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎలక్ట్రానిక్,ప్రింట్ మీడియా ద్వారా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల పిల్లల భవిష్యత్ ఏ విధంగా ఛిద్రం అవుతుందో డాక్యుమెంటరీలు రూపంలో విస్తృత ప్రచారం చేపట్టాలని సమాచార పౌర సంబంధాల శాఖాధికారులకు సూచించారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా పిల్లలకు తగిన సహాయం అందించాలని, వారి సలహాలు సూచనలు తీసుకొని పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వాలని చెప్పారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి 3 నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలకు సంబంధించిన అంశాలలో సహాయం కావాల్సిన వారు డిసిపియు ద్వారా బాలలకు రక్షణ సంరక్షణ అందిస్తారన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణపై మెరుగైన ప్రచార వీడియోలు రూపొందిస్తామన్నారు. మత్తుకు బానిసైనవారిని నేరస్తులుగా కాకుండా బాధితులుగా చూడాలని, డీ అడిక్షన్ కేంద్రాల సహకారంతో వారిని మామూలు మనుషులుగా మార్చే ప్రయత్నం చేయాలని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నిసార్లు ఓటింగ్‌కు వచ్చారో తెలుస్తుందన్నారు. ఎన్నికల సంఘం స్పందించి తక్షణమే అక్రమాలపై విచారణ చేపట్టాలని, బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగిన ఘటనలు ప్రజాస్వామ్యానికి తీరని మచ్చని, ప్రజాప్రతినిధులే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని టిడిపి వారు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, ఇందుకు పోలీసులు, అధికార యంత్రాంగాన్ని అడ్డు పెట్టుకున్నారని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నా అధికార పార్టీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని, పిడిఎఫ్ ఏజెంట్లను చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దుర్భాషలాడటం దారుణమని అన్నారు. బెల్లంకొండలో పిడిఎఫ్ ఏజెంట్లను వందమందికి పైగా టిడిపి శ్రేణులు చుట్టుముట్టి బంధించారన్నారు. మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు పిడిఎఫ్ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఓటమి తప్పదని గ్రహించిన కూటమి ప్రభుత్వం చివరి గంటలో సిఎం ఆదేశాల మేరకు రిగ్గింగ్ పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 80 శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగిన ప్రతి కేంద్రంలో రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ 45 ఏళ్ల రాజకీయ జీవితం కలిగిన సిఎం చంద్రబాబు ఎమ్మెల్సీ పదవి కోసం ఇంత దిగజారడం ఆయన స్థాయికి తగదన్నారు. విద్యావంతులు మండలిలో ఉంటే ప్రశ్నిస్తారని, ఆప్రశ్నలు లేకుండా ఉండాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించాలనే ఉద్దేశంతో దొంగ ఓట్లు వేయించారని, ప్రశ్నించిన పిడిఎఫ్ ఏజంట్లపై దాడులకు పాల్పడినా పోలీసులు, ఇతర యంత్రాంగం మిన్నకుండిపోయిందని విమర్శించారు.

అరకొర కేటాయింపులు

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు ఛానల్‌కు రూ.400 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించినా బడ్జెట్ ప్రతిపాదనల్లో మాత్రం కృష్ణా డెల్టా మొత్తం మీద రూ.701 కోట్లు కేటాయించారు. ఇందులో నిర్వహణ ఖర్చులు, జీతాలు పోను కాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధికి కూడా నిధులు ఇవ్వనున్నారు. ఇక గుంటూరు ఛానల్‌కు తొలి విడత కేవలం భూ సేకరణకు గత ప్రభుత్వం కేటాయించి పెండింగ్‌లో ఉంచిన రూ.100 కోట్లు మాత్రమే ఈసారి కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది. అయితే మిగతా రూ.300 కోట్లు ఏ పద్దు కింద చూపారన్నదీ స్పష్టత లేదు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యేలు రూ.400 కోట్లు కేటాయించినట్లు సంబరాలు చేశారు. పులిచింతల ప్రాజెక్టు నిర్వహణ ఖర్చుల కోసం రూ. 16.32 కోట్లు ఇచ్చారు. కీలకమైన గోదావరి పెన్నా అనుసంధానం పథకానికి కేవలం రూ.200 కోట్లు కేటాయించారు. ఈ పథకం ఊపందుకుందని ఇప్పటికే వార్తలు వచ్చాయి. రూ.200 కోట్లతో మొదటి దశ పరిధిలో భూ సేకరణకు కూడా నిధులు సరిపోవని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం రూ.6 వేల కోట్ల అంచనాలతో 2018లో అప్పట్లో సిఎంగా చంద్రబాబు నాయుడు నకరికల్లులో శంకుస్థాపన చేయగా ఆ తరువాత ఇప్పటి వరకు ఈ పథకం అమలుపై కదలిక లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేటాయింపులు ఇస్తారని ఆశించినా కేవలం రూ.200 కోట్లతో సరిపెట్టారు.

పల్నాడు జిల్లాలో కీలమైన మరో ప్రాజెక్టు వరికపూడిసెలకు నిధులు కేటాయించలేదు. పల్నాడు జిల్లాలో నీటిపారుదల రంగానికి దాదాపు మొండిచేయి చూపినట్లు అయింది. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి. గతేడాది నవంబరు 11న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా అరకొర కేటాయింపులు చూపారు. అయితే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు మాత్రం వచ్చే మే నుంచి ప్రారంభిస్తామని బడ్జెట్‌లో వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాలకు నిధులు కేటాయించినా ఎవరికీ వర్తింపజేయలేదు.

గత ప్రభుత్వం రైతు భరోసా కింద రాష్ట్రం రూ.7500, కేంద్రం రూ.6000 ఇవ్వగా టిడిపి ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ఇందులో కేంద్రం రూ.6 వేలు కాగా రాష్ట్రం రూ.14 వేలు కేటాయించాల్సి ఉండగా బడ్జెట్‌లో తక్కువగా చూపడం కూడా రైతులందరికీ ఈపథకం అందదని స్పష్టమైంది. భూమి ఉంటే సరిపోదని, పంట సాగు చేసిన వారికే ఇస్తారని అధికారులు చెబుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో కేటాయింపులు ఇవ్వలేదనే విమర్శలు వచ్చాయి. గుంటూరులో నిలిచిపోయిన భూగర్భ డ్రెయినేజి పనులకు సంబంధించి కూడా ఎటువంటి ప్రతిపాదనలు లేవు. ఈ పథకం ఎప్పటికి పూర్తవుతుందనేది స్పష్టత లేదు.

విజ్ఞాన పెంపునకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయి

ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ జయకుమార్

ఘనంగా ప్రారంభమైన రెండు రోజుల సైన్స్ ఎగ్జిబిషన్



నమూనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ రాణి జయకుమార్

ప్రజాశక్తి -మేడికొండూరు

విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ కోనూరి జయకుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో రెండు రోజుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరు జయకుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లా డుతూ ప్రతి విద్యార్థిలో తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని ప్రతివిద్యార్థి ముందుకు సాగాలని తెలిపారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జి బిషన్లో భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాలు నుంచి అత్యవసర సమయాలలో ఉపయోగించే సెన్సార్ ఆధారిత నీటి స్పింకర్లను ఎలక్ట్రానిక్ పియానో, ఆటోమేటిక్ డస్ట్‌బిన్, కూలర్ సౌర వ్యవస్థ నమూనాలు ప్రత్యేకంగా ఆకర్షించబడ్డాయి. 200 నమూనాలను విద్యార్థులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపల్ కోనూరిరాణి జయ కుమార్, సైన్స్ ఎగ్జిబిషన్ ఇంచార్జిలు విజయలక్ష్మి, జైభూన్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



అతిథి ఉపన్యాసం చేస్తున్న ఎస్‌పి ఠాకూర్

ఆధునిక అంశాలపై పట్టు సాధించాలి

మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ ఠాకూర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

నేటితరం విద్యార్థులు, యువత ఆధునిక అంశాలపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి సూచించారు. విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభా గం, ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరంలు శుక్రవారం సంయుక్తంగా ఫ్రమ్ స్టూడెంట్ టు ఎక్సపెర్ట్ లీడర్షిప్ పైప్ లైన్ ఫర్ మోడ్రన్ వర్క్ ప్లేస్ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ ఠాకూర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తమను తాము మలుచుకోవాలని సూచించారు. వ్యాపారస్థాపన, అభివృద్ధి వైపు యువత అడుగులు వేయాలని పేర్కొన్నారు. స్వీయ నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం కోసం పుస్తక పఠనం కొనసాగించాలని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ థింకర్స్ ఫోరం ఎన్ఐటి వరంగల్ నుండి డాక్టర్ కె.వెంకటకృష్ణారావు, వాణిజ్య విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎన్.రత్నకిషోర్, డాక్టర్ ఎ.కనక దుర్గ, డాక్టర్ జి.నాగరాజు, డాక్టర్ వి.విష్ణు, డాక్టర్ కే. సుధీర్‌కుమార్, డాక్టర్ చంద్రబానురెడ్డి, డాక్టర్‌కృష్ణకుమారి, డాక్టర్ రఫీ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో సేవ్ బర్డ్స్ కార్యక్రమం

ప్రజాశక్తి చేబ్రోలు

వేసవిలో పక్షులను కాపాడేందుకు సేవ్ బర్డ్స్, పక్షుల దాహార్తిని తీర్చేందుకు సెల్ఫీ విత్ వాటర్ ఫర్ ఛాలెంజ్ కార్యక్రమానికి మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఎండలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఉమాశంకర్ కోరారు. సేవ్ బర్డ్స్ వాటర్ పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమా శంకర్ ఈ ఛాలెంజ్ తీసుకుని ఆయన కుమారుడు మేఘనాథ్‌కు ఇచ్చారు. అనంతరం మాశంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై మట్టి పాత్ర లేదా గిన్నెలో నీరు పోసి ఆహార గింజలను ఉంచటం వలన పక్షుల దాహార్తి తీర్చి వాటి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరు ఈ వినూత్న ఛాలెంజ్‌ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్, అసోసియేషన్ చేపట్టిన ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ పక్షుల ప్రాణాలు కాపాడేందుకు భాగస్వాములుగా చేరి మనలోని మానవత్వాన్ని చాటి చెప్పాలని ఆయన నిచ్చారు. ఈ ఛాలెంజ్ స్వీకరించిన వారు ఫొటోలు తీసి 8333089722 నెంబరుకు పంపించాలని కోరారు.



పాత్రలో నీరుపెడుతున్న చిన్నారి, దాహం తీర్చుకుంటున్న పక్షులు

ఘనంగా స్వామివారి తెప్పోత్సవం

ప్రజాశక్తి - పెదకాకాని : శ్రీ మల్లేశ్వర స్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అంగరంగ వైభవంగా శ్రీభ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల తెప్పోత్సవము జరిగింది. అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద కాకాని పురవీధులలో అశ్వవాహనంపై గ్రామోత్సవము మేళతాళముల నడుమ అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాత్రి వార్ల తెప్పోత్సవము ప్రత్యేక పూల అలంకరణతో ఏర్పాటు చేసిన హంస వాహనంపై దేవస్థాన ఉత్తర భాగాన ఉన్న తటాకంలో అత్యంత వైభవోపేతంగా వివిధశాఖల సహకారంతో నిర్వహించినట్లు, ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదాలు పంపిణీ చేసినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.

మరింత అందుబాటులోకి ఆర్టీసీ సేవలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్టీసీ సేవలను ప్రయాణికులు వినియోగించుకోవడం ఆనందదాయకమని ఆర్టిసి డిపో మేనేజర్ ఎ. రాజశేఖర్ అన్నారు. శివ భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టిసి బస్సులు ద్వారా గతంలో కంటే ఆర్టీసీకి అధిక లాభం చేకూరిందని రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రువారం స్థానిక ఆర్టీసీ డిపోలోని తన కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహాశివరాత్రి తిరునాళ్ళ సందర్భంగా బాపట్ల జిల్లాలోని గోవాడ బాల కొటేశ్వరస్వామి శైవక్షేత్రానికి 30 బస్సులు, చేబ్రోలు మండలంలోని క్వారీ పుణ్యక్షేత్రం బాల త్రిపురసుందరి సమేత సంగమేశ్వర స్వామి తిరునాళ్లకు 32 బస్సులు, శ్రీశైలంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి ప్రత్యేకంగా 7 బస్సు సర్వీసులను నడిపినట్లు చెప్పారు. ప్రయాణికుల ద్వారా గతేడాది రూ. 10.51 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 11.15 లక్షల ఆదాయం సమ కూరిందన్నారు. విహార యాత్రలకు, వివాహాలకు, దైవ దర్శనాలకు కావలిసిన ఆర్టీసీ బస్సుల సేవలను తక్కువ ధరలకు వినియోగించుకోవచ్చని తెనాలి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను కోరారు.

రిగ్గింగ్ జరిగిన కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలి

పిడిఎఫ్ ఏజెంట్లు, ప్రజా సంఘాల డిమాండ్ - పోలింగ్ రోజు దౌర్జన్యాలు, దాడులపై వివరాల వెల్లడి - టిడిపి శ్రేణుల దారుణాలకు పోలీసులు, అధికారులు సహకరించారని విమర్శ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి శ్రేణులు, ఏజెంట్లు దౌర్జన్యాలకు పాల్పడ్డారని, భారీగా దొంగోట్లు వేయించుకున్న నేపథ్యంలో రీపోలింగ్ జరపాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఓటర్లు కానివారితో, గుర్తింపు కార్డులు లేకుండా ఓట్లు వేయించారని, దీనికి పిడిఎఫ్ ఏజెంట్లు అభ్యంతరం చెప్పగా దుర్భాషలాడుతూ బయటకు లాగేశారని, ఒక మున్సిపల్ కార్మికురాలిని ఓటేయాలని ఒత్తిడి చేయగా ఆమె సంతకం రాదంటూ తిరస్కరించారని వివరించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు ఈ దారుణాలను వివరించగా ఆయనా పట్టించుకోపోవడం ద్వారా దొంగ ఓట్లకు ఆయనే పురమాయించినట్లు అర్థమవుతోందని విమర్శించారు. పోలింగ్ కేంద్రాలను ఆయన మూడుసార్లు సందర్శించి అధికారులతో మాట్లాడారని, ఇలా వస్తున్నారేమిటని అడిగితే 'ఇతన్ని బయటకి నెట్టేయండి' అని తన అనుచరులకు చెప్పాడంతో వారు తనపై దాడి చేశారని, స్పృహ తప్పి పడిపోయిన తనను పోలీసులే లేపి తాగునీరు ఇచ్చారని తెలిపారు. 384 పోలింగ్ కేంద్రంలోని పిడిఎఫ్ ఏజెంటు పేరుబోయిన వెంకటేశ్వర్లుతో గొడవపెట్టుకొని బయటకు నెట్టేశారని, అక్కడున్న సిఐకు చెప్పినా టిడిపి వారికే ఆయన సహకరించారని, ఆ తర్వాత చివరి 15 నిమిషాల్లో 62 ఓట్లు వేసుకున్నారని, అన్ని కేంద్రాల్లోనూ ఇలా చివరి గంటలో దొంగ ఓట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. వీటిపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రజాశక్తి - క్రోసూరు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాడులు, రిగ్గింగ్‌కు పాల్పడిన వారిపై కేసుల నమోదుతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని, రిగ్గింగ్ చేసిన పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు ప్రజాసంఘాల నాయకులతో కలిసి శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో పోలీసులు, అధికారులు విఫలమయ్యారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదే మండలం లేదా పక్క మండలం వారిని పోలింగ్ అధికారులుగా నియమించారని, కనీసం రెవెన్యూ డివిజన్లు అయినా మార్చాలని తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్దే గుంపులుగా చేరి పిడిఎఫ్ ఏజెంట్లను బెదిరిస్తున్నా పోలీసులు చూస్తూ ఊరుకున్నారన్నారు. పెదకూరపాడులో పిడిఎఫ్ ఏజెంటును, వారి కుటుంబీకులను బెదిరించి రానీయకుండా చేశారని, బెల్లంకొండ, అచ్చంపేటలో ఇద్దర్ని బయటకు తీసుకెళ్లారని తెలిపారు. బెల్లంకొండలో చిన్నం పుల్లారావు, భుతుకూరి నరసింహారెడ్డిపై దాడి చేసి గదిలో బంధించారని, పైగా తప్పుడు కేసులు పెట్టారని, క్రోసూరులో దొంగ ఓట్లు వేస్తున్న వారిని తిమిశెట్టి హనుమంతరావు అడ్డుకునే ప్రయత్నం చేస్తుండగా టిడిపి నాయకుడు కంచేటి సాయికుమార్, అతని అనుచరులు సుమారు 40 మంది భయోత్పాతం సృష్టించి రిగ్గింగ్ చేసుకున్నారని చెప్పారు. అచ్చంపేటలో ఏజెంటు కెకె రెడ్డిపై దాడికి యత్నించారని, దొంగ ఓట్లు వేస్తున్నారని పోలీసులు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. వీటన్నిటిపైనా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు, రైతు, కౌలురైతు, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు జి.మహేష్, సి.హెచ్.యేసయ్య, కె.గోపీకృష్ణారెడ్డి, నాగ సంధ్య, ఎ.ఆంజనేయులు, కె.పెద్దబ్బాయి, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - వినుకొండ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని, అధికారులు, పోలీసుల సహకారంతో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.హనుమంతరెడ్డి, నాయకులు బి.వెంకటేశ్వర్లు విమర్శించారు. స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలోని 15 పోలింగ్ కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాలతో టిడిపి శ్రేణులు అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. వినుకొండ పట్టణంలోని 361 పోలింగ్ కేంద్రంలో పిడిఎఫ్ ఏజెంటు బాలస్వామిని తిట్టి బయటకు పంపించారని, పట్టణ సిఐ శోభన్‌బాబు సమక్షంలో ఇలా మాట్లాడిన టిడిపి పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఆయూబ్ ఖాన్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. శావల్యాపురం, ఈపూరు వినుకొండ రూరల్ మండలంలోని కొత్తపాలెం, నాగులవరం పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు వేయడంతో అక్కడ పోలింగ్ 90 శాతానికి మించిందని చెప్పారు. ఆ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరక్షరాస్యులతో, మహిళలకు బురఖాలు వేసి దొంగ ఓట్లు వేయించారన్నారు. టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఓడిపోతారనే భయంతోనే ఇవన్నీ చేశారని విమర్శించారు. సమావేశంలో రైతుసంఘం మండల కార్యదర్శి ఆర్.మునివెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు పి.వెంకటప్పయ్య, ఆర్.వెంకిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అక్రమాలకు పాల్పడి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్న టిడిపికి భవిష్యత్‌తో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం గందరగోళ పరిస్థితి ఏర్పడింది. 286 పోలింగ్ కేంద్రంలో పిడిఎఫ్ ఏజెంటు శ్రీనివాసరావును టిడిపి ఏజెంట్లు, మరో ఇండిపెండెంట్ ఏజెంట్లు బయటకు నెట్టుకొచ్చారు. తప్పుడు ఫిర్యాదుతో పోలీసులకు అప్పజెప్పగా వారు శ్రీనివాసరావును స్టేషన్‌కు తీసుకెళ్లారు. సిపిఎం నాయకులు కలుగజేసుకుని శ్రీనివాసరావును విడిపించి మళ్లీ ఏజెంట్ స్థానంలో కూర్చోబెట్టారు. 268 పోలింగ్ కేంద్రంలోనూ దొంగ ఓట్లు వేసుకున్నారని పిడిఎఫ్ ఏజెంట్లు ఎం.నరసింహారావు చెప్పారు. వీటిపై సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు మాట్లాడుతూ దొంగ ఓటు వేయటానికి వచ్చిన మహిళను తిప్పి పంపించినందుకు టిడిపి వారు దాడి చేశారని అన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా లక్ష్మణరావు గెలుపు ఖాయం

పిడిఎఫ్ ఎన్నికల పల్నాడు జిల్లా సమన్వయ కమిటీ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎమ్మెల్సీగా కెఎస్ లక్ష్మణరావు మొదటి ప్రాధాన్య ఓట్లతోనే గెలుపొందడం ఖాయమని పిడిఎఫ్ ఎన్నికల పల్నాడు జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.మోహనరావు, కో-కన్వీనర్ ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం రెండు నెలలపాటు కృషి చేసిన ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలకు, నిరుద్యోగ పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో లక్ష్మణరావుకు పట్టభద్ర ఓటర్లు అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మణరావును ఓడించడానికి కూటమి ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడిందని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని, పిడిఎఫ్ ఏజంట్లపై దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. జయాపజయాలతో సంబంధం లేకుండా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, కాంట్రాక్ట్ ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలపై పిడిఎఫ్ నిరంతర పోరాటం సాగిస్తుందన్నారు. సమావేశంలో కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.ప్రేమ్‌కుమార్, జిల్లా మాజీ కార్యదర్శి కె.కోటేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.మల్లీశ్వరి, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి పాల్గొన్నారు.

బాసట స్కాలర్‌షిప్ టెస్ట్ ఫలితాలు విడుదల

ఐదుగురిలో నలుగురు లింగారావుపాలెం జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సామాజిక సాంస్కృతిక వేదికైన 'బాసట' ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి స్కాలర్‌షిప్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. మొదటి ఐదు స్థానాల్లో... లింగారావుపాలెం జెడ్‌పి పాఠశాలకు చెందిన బి.యశస్విని, సొలస జెడ్‌పి పాఠశాలకు చెందిన ఎ.గీతాశ్రీలక్ష్మి, లింగారావుపాలెం జెడ్‌పి పాఠశాలకు చెందిన ఎన్.మేఘనాశ్రీ, ఎస్.నాగఅజయ్‌బాబు, డి.హారిక నిలిచారు. విజేతలకు మేలో బాసట ఆధ్వర్యంలో జరిగే సమ్మర్ స్టడీ క్యాంప్ సందర్భంగా బహుమతులు అందిస్తామని, నగదు బహుమతులను వారు పై చదువులకు ఉపయోగించుకునేందుకు వీలుగా ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభను కనపరచిన పాఠశాలగా లింగారావుపాలెం జెడ్‌పి పాఠశాలను గుర్తించామని, ఆ పాఠశాలకు బ్లూ రిబ్బన్ మెమొంటోను ఇస్తామని చెప్పారు. స్కాలర్‌షిప్ టెస్ట్‌లో 309 మంది పాల్గొనగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.11 వేలు, రూ.9 వేలు ఇస్తామని, మరో ఐదు పాఠశాలలకు చెందిన ఐదుగురికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తామని తెలిపారు.

త్రికోటేశ్వరునికి రూ1.78 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా త్రికోటేశ్వరునికి రూ.1.78 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.చంద్రశేఖర్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఇది రూ.14.20 లక్షలు అదనమన్నారు. అభిషేకం, దర్శనం, పూజ టిక్కెట్ల ద్వారా రూ.65.01 లక్షలు, ప్రసాదాలు విక్రయాల ద్వారా రూ.38.17 లక్షలు, అన్నదాన చందాలు ద్వారా రూ.1.02 లక్షలు, హుండీల కానుకల ద్వారా రూ.73.50 లక్షలు వచ్చాయని వివరించారు. కోటప్పకొండ తిరునాళ్ల విజయవంతంగా జరగడానికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఆలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



అమరావతిలో ఒడిశా యువత

ప్రజాశక్తి - అమరావతి

ఒడిశాకు చెందిన యువతీ యువకులు అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టును శుక్రవారం సందర్శించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం నుంచి అంతర్ రాష్ట్ర యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం జరుగుతుండగా ఇందులో భాగంగా యువకులు ఇక్కడికి వచ్చారు. వీరిలో ఒడిశాలోని 5 జిల్లాలైన మయుర్భంజ్, గంజాం, పుల్బని, నబరంగపూర్, కంధమాల్ నుంచి మొత్తం 26 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన క్షేత్రం అమరావతి, ఉండవల్లి గుహలనూ సందర్శించారు. గుంటూరు నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాల మధ్య ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అమరావతి వ్యవసాయ పరిశోధన క్షేత్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రవీంద్రారెడ్డి, ఎఎన్‌యు ప్రొఫెసర్ రెహ్మాన్, టూరిజం డిపార్ట్మెంట్ చెందిన నాయుడమ్మ, జనచైతన్య సమితి వ్యవస్థాపకులు డి.విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి టి.సాంబశివరావు, కోఆర్డినేటర్ వి.అనిల్ కుమార్, బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పి.పూర్ణచంద్రరావు, బి.రాంబాబు నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే : జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భూ సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టిన రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే సూచించారు. రొంపిచర్ల మండలం గోగులపాడు, విప్పర్లపల్లి గ్రామాల్లో రీసర్వేను జెసి శుక్రవారం పరిశీలించారు. ఇన్‌చార్జి తహశీల్దార్ బి.నిర్మల, మండల సర్వేయర్‌కు పలు సూచనలు చేశారు. విప్పర్లపల్లి అగ్రహారం భూముల గురించి రొంపిచర్ల తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలతో సమావేశమయ్యారు. గ్రామంలోని ఈనాం భూములు, ఆక్రమణలపై వివరాలు అడిగి నివేదికివ్వాలని ఆదేశించారు.



ఉత్పాదక సమస్యలపై విస్తృత పరిశోధనలు అవసరం

ప్రజాశక్తి-గుంటూరు

వ్యవసాయ రంగంలో రైతులు వివిధ రకాల ఉత్పాదక సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా అడ్వైజర్ రామ్ కౌండిన్య అన్నారు. శుక్రవారం లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్)లో జన్యుపరమైన ఇంజినీరింగ్, మాలిక్యులర్ బ్రీడింగ్, బయోటెక్నాలజీ నూతన ఆవిష్కరణలపై పరిశోధకులు, నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులతో వర్క్‌షాప్ నిర్వహించారు. వర్సిటీ వీసీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీ దేవి, బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా, ఎఫ్ఎస్ఐఐ అడ్వయిజర్ కౌండిన్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం కౌండిన్య విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ సమస్యలను పరిష్కరించేందుకు బయోటెక్నాలజీ కీలకమన్నారు. బయోటెక్నాలజీ ట్రాన్స్‌జెనిక్, నాన్-ట్రాన్స్‌జెనిక్ రెండింటిలోనూ పరిష్కారాలు అందిస్తుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న ఉత్పాదకత అవసరాలకు బయోటెక్ ఆవిష్కరణలు అత్యంత అవసరమన్నారు. వ్యవసాయ రంగంలో భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి కొరత, అతివృష్టి, అనావృష్టి వంటి అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు పరిశోధనలు పెరగాలన్నారు. ప్రపంచ దేశాల్లో టెక్నాలజీ పెరగటం వల్ల ఉత్పత్తి ఖర్చులు తగ్గి, రైతులకు లాభాలు వస్తున్నాయన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన భారత దేశంలో వ్యవసాయానికి జిడిపిలో 0.6శాతమే కేటాయింపులు చేస్తున్నామని, దీని వల్ల పరిశోధనలు పెరగట్లేదన్నారు. ప్రపంచ దేశాల్లో మన వ్యవసాయ ఉత్పత్తులు సేంద్రీయ పద్ధతిలో పండించినట్టు ధ్రువీకరణ అడుగుతున్నాయని, అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, రైతులలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ (బీసీఐఎల్), సంయుక్తంగా ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐఐ) మద్దతుతో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో జీనోమ్ ఎడిటింగ్, పురుగు, వ్యాధి నిరోధకత, నేల సారం, చిన్న రైతులకు బయోటెక్నాలజీ వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాల గురించి చర్చించారు. బయోటెక్నాలజీ పూర్తి స్థాయిలో ఉపయోగపడటానికి పెట్టుబడులు, విధాన పరమైన మద్దతు, రైతు విద్య చాలా అవసరమని నిపుణులు పేర్కొన్నారు.



హాజరైన కౌండిన్య, ఎన్‌జిరంగా వర్సిటీ వీసీ తదితరులు

కార్మికుల పోరాటానికి అండగా ఉంటాం..



ప్రజాశక్తి- తాడేపల్లి

ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయంగా దక్కాల్సిన నష్టపరిహారం అందే వరకూ పోరాటంతో పాటు దీక్షలు కొనసాగించాలని మంగళగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దీక్ష శిబిరానికి చేరుకుని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోరాట పటిమ గల సిఐటియు లాంటి కార్మిక సంఘం కార్మికులకు అండగా ఉండటం మంచి పరిణామమన్నారు. ప్రభుత్వం దిగి వచ్చేవరకు కార్మికులు చేస్తున్న పోరాటానికి వైసిపి తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని చెప్పారు. ఐక్య పోరాటాలు మరింత విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. 87వ రోజుకు చేరిన దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.ఆదినారాయణ ప్రారంభించారు. దీక్షల్లో ఎం.గురవయ్య, ఎం.శివకుమారి, ఎస్.కె.ఇమామ్‌బీ, సారమ్మ, వై రమాదేవి కూర్చొన్నారు. సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు అడుగుతున్నది భిక్ష కాదని, తమ కష్టార్జితం అని వెల్లడించారు. ప్రభుత్వాలు, యాజమాన్యాలు ఇది గుర్తించాలని కోరారు. ప్రభుత్వం సానుకూలమైన వాతావరణంలో సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి ఎస్ వి సింగ్, వై యహోశోవ, బి.దానయ్య, ఎస్.కె.బాషా, ఎండీ రహీం తుల్లా, ఆర్.విజయ్, ఎం.సుబ్బారావు, ఎస్.కె.ఇస్మాయిల్, ఎస్.కె.ఆరిఫ్, బి.అంకయ్య, టి.దుర్గా భవాని, ఎం.శారద, వి.రిబ్కా, డి.రమణ, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను పూర్తి చేస్తాం..

గుంటూరు ఛానల్‌కు రూ.400 కోట్ల నిధులు కేటాయింపు : కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలులో భాగంగా రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ పథకాలకు నిధులు కేటాయించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర బడ్జెట్లో గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయింపు చేయడంపై ఆయన సిఎం చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. 50 ఏళ్ల కల అయిన గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ కోసం తొలి విడత భూ సేకరణకు రూ.100 కోట్లు భూ సేకరణకు, విస్తరణ, పొడిగింపునకు రూ.300 కోట్ల కేటాయించారని చెప్పారు. వట్టిచెరకూరు, పెదనందిపాడు, పర్చూరు మండలాల్లో 441 ఎకరాలు భూ సేకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. అలాగే ఛానల్ పనుల ఆధునికీకరణకు మరో రూ. 650 కోట్లకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశామన్నారు. రాబోయే ఎన్నికల్లోపు ఆ విస్తరణతో పాటు ఆధునీకీకరణ పనులు కూడా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. 47 కిలోమీటర్ల మేరకు ఛానల్ పొడిగింపు, 27 కిలోమీటర్ల వరకు ఆధునికీకరణ, విస్తరణ ఎతనులు జరుగుతాయన్నారు. దీనివల్ల 34 వేల ఎకరాల భూమి అదనంగా సాగులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం 27 వేల ఎకరాలు ఈ ఛానల్ కింద సాగు అవుతుందన్నారు. ఈ ఛానల్ పరిధిలో మంగళగిరి వద్ద లిఫ్టు ఇరిగేషన్ పథకం కూడా అమలు చేస్తారని తెలిపారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో ప్రస్తుతం సాగులో ఉన్న రబీ పంటలకు నీటి కొరతను తీర్చేందుకు తక్షణం 1200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూముల రికార్డులను డిజిటలైజేషన్ చేసినందుకు కేంద్రం నుంచి రూ.500 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులు రాష్ట్రానికి వచ్చాయని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు సమర్థత వల్ల ఈ నిధులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు మాట్లాడుతూ గుంటూరు ఛానల్, నల్లమడ వాగు ఆధునికీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం వల్ల ఎన్నో ఏళ్ల రైతుల కల నెరవేరుతుందన్నారు. ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, మహ్మద్ నజీర్, గళ్లా మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పాఠశాలల్లో బాల మేధావుల ఆవిష్కరణలు

ప్రజాశక్తి -తుళ్లూరు :

రాజధాని అమరావతిలోని వీఐటీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అమరరాజా అడ్వాన్స్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఎం.జగదీష్ మాట్లాడుతూ.. భారతీయ బ్యాటరీ పరిశ్రమకు మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెటీరియల్స్‌తో పాటు ఇంజినీరింగ్ ప్రధాన రంగాలలో నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి అవసరమన్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎస్‌వీ కోటా రెడ్డి మాట్లాడుతూ పరిశోధన కార్యక్రమాలకు ప్రభుత్వం నిధుల కేటాయింపును గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, ప్రొఫెసర్ శ్రీనివాస్, డాక్టర్ ఎం.వెంకట రజనీకాంత్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తాము రూపొందించిన ఆవిష్కరణలను వివరిస్తున్న విద్యార్థులు

జిల్లా స్థాయి పోటీల్లో మున్సిపల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుంటూరులో నిర్వహించిన పోటీలలో కాండ్రు కమల మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు షేక్ జికి వ్యాసరచనలో ద్వితీయ బహుమతి, పఠాన్. జాస్మిన్ వకృత్వ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు డీఈవో సి.వి.రేణుక విద్యార్థులను అభినందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచేందుకు కృషి

మంగళగిరి : విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నట్లుగా జాదూగర్ కె.ఆదినారాయణ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బాలోత్సవం, స్టెప్ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్లో మ్యాజిక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనంలోనే సామాజిక అంశాలను గురించి మ్యాజిక్ షో జోడించి వివరిస్తున్నట్లు తెలిపారు. కూల్ డ్రింక్స్ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమని.. కొబ్బరినీళ్లు, మజ్జిగ మాత్రమే తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మతోన్మాదం వల్ల పరిణామాలను వివరించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


తాడేపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. భూమి గురుత్వాకర్షణ శక్తి, ప్రాజెక్టులు, పరిశ్రమలు మానవులకు ఉపయోగపడుతున్న తీరును ప్రాజెక్టుల రూపంలో విద్యార్థులు వివరించారు. ప్రదర్శనను ప్రారంభించిన సివిల్ కోర్టు న్యాయవాది ఎన్ఎం వెంకయ్య మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో రామన్ చేసిన సేవలను కొనియాడారు. జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో చైతన్య హై స్కూల్ ఈజీఎం మురళీకృష్ణ, వీవీ రామారావు, కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ప్రసాద్, ప్రిన్సిపల్ సుధీర్ ప్రసాద్, బి.శ్రావణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న అతిథులు



విద్యార్థిని అభినందిస్తున్న అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు



మాట్లాడుతున్న అమరరాజా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నాలజీ ఆఫీసర్ జగదీష్

ఎంఈవోపై విచారణ

ప్రజాశక్తి-రాజుపాలెం
ఫిబ్రవరి 27న పట్టభద్రుల ఎన్నికలలో రాజుపాలెం ఎంఈవో బి.మల్లికార్జున శర్మ ఎన్నికల బరిలో నిలిచిన ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం చేసినట్లు అభియోగాలు వచ్చాయి. ఇదే విషయాన్ని పలువురు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నికల కమిషనర్ సూచనలతో పల్నాడు డిప్యూటీ డీఈవో ఎస్.కె.మహబూబ్ సుభాని శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నామని తెలిపారు.

16న ఓబన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్
మాచర్ల పట్టణంలోని కొత్త హాలు సెంటర్లో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 16న చేపట్టనున్నట్లు వడ్డే ఓబన్న విగ్రహ కమిటీ ఛైర్మన్ కొమెర అనంతరాములు తెలిపారు. శుక్రవారం విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుల్లో వడ్డె ఓబన్న ఒకరని.. ఆయన చరిత్ర మరుగునపడటం బాధాకరమని తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను చరిత్రలో తక్కువ చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఓబన్న వీరత్వం నేటి తరాలకు అందివ్వాలనే లక్ష్యంతో విగ్రహం ఏర్పాటు ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకట రామిరెడ్డి, కొమెర శివ, ఓర్చు క్రాంతి, తిరుమల కొండ జమలయ్య, చల్లా హరి, ఉప్పుతోళ్ల దుర్గారావు, బత్తుల కుమార్, కొమెర శ్రీను, బత్తుల కోటి, బత్తుల దుర్గారావు, దేరంగుల దాసరయ్య, వేముల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నపరెడ్డి మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-అచ్చంపేట
అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చినపరెడ్డి అకాల మరణం తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం తాళ్లచెరువులో చిన్నపరెడ్డి భౌతికకాయాన్ని దర్శించి, నివాళు లర్పించారు. వైఎస్సార్‌సీపీకి, ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్
సారాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గుంటూరు ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి, ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ సూచించారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెల్దుర్తి మండలం లోని శిరిగిరిపాడు గ్రామలో నాటు సారాయి కేసుల్లో ఆరుగురు పాత నిందితులను వెల్దుర్తి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట ఎక్సైజ్ పోలీసులు బైండ్ ఓవర్ చేశారు. మండలంలో కొత్త పుల్లారెడ్డిగూడెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా తయారీ, అమ్మకాలు వల్ల కలిగే నష్టాలను వివరించారు. సారాకు దూరంగా ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

భూ సర్వే రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి : నరుకుల్లపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆర్డీఓ రమణ కాంత్ రెడ్డి భూ సర్వే రికార్డులను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ భూమి పునర్వ్యవస్థీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియపై మండల రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశిస్తూ, భూమి యజమానులకు స్పష్టమైన సరిహద్దులు, పక్కా రికార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి పట్టణంలోని సబ్ జైలును మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి వి.విజయ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. ఆహార పదార్థాలను, సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. రిమాండ్ ముద్దాయిలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సబ్ జైల్లో అందుతున్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు.

చిట్టి చేతులు.. పెద్ద ఆవిష్కరణలు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-చిలకలూరిపేట
జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ నమూనాలను సందర్శకులను ఆకట్టుకున్నాయి.

చిలకలూరిపేట : పట్టణ పరిధిలోని పసుమర్రు శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తాము సొంతంగా తయారు చేసిన పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. అనంతరం వారికి వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హనుమంతరావు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గద్దె హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి
మాచర్ల : యువత శాస్త్రీయ దక్పథాన్ని అలవరచుకోవాలి కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐవీ నాగమణి అన్నారు. పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు శాస్త్ర వేత్తల ఫొటో ప్రదర్శన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

మాచర్ల శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...
మాచర్ల శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో భౌతిక శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ సైన్స్ టెక్నాలజీని ఉపయోగించుకుని నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలన్నారు.

నారాయణలో సైన్స్ డే వేడుకలు...
పట్టణంలోని నారాయణ పాఠశాలలో సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉల్లారెడ్డి మాట్లాడుతూ మన దేశ ఎదుగుదలలో శాస్త్రవేత్తల కృషి ఎనలేనిదన్నారు. జాతీయ స్థాయిలో సైన్స్ స్ఫూర్తిని చాటాడం, వ్యాప్తి చేయడం ఈ నేషనల్ సైన్స్ డే లక్ష్యాలు అని చెప్పారు. అనంతరం పాఠశాల చిన్నారులు తయారు చేసిన పలు రకాల సైన్స్ ప్రాజెక్టులను క్షుణ్ణంగా పరిశీలించి ఉత్తమమైన వాటికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీయం లక్ష్మణ్ రెడ్డి, కోఆర్డినేటర్ భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ డే వేడుకలో చిన్నారులు

సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ హైస్కూల్లో..
సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు క్రాంతి చంద్ర కుమార్, సైన్స్ టీచర్స్ శ్రీనివాస ఆచారి, అనితల ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సైన్స్ పరికరాలను ప్రదర్శించారు.

జీవాలయం లయోలా పాఠశాలలో వేడుకలు
వినుకొండ : స్థానిక జీవాలయం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వారం రోజులపాటు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా విచ్చేశారు. సైన్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాల శౌరయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు.

వినుకొండ : మండల కేంద్రం శావల్యాపురం శ్రీరామ పబ్లిక్ స్కూల్లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు సైన్స్ అంశాల పట్ల ఆసక్తి కనబరచాలని, చిన్నతనం నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్సు నమూనాలను తిలకించారు.

యడ్లపాడు : మండలంలోని మైదవోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ప్రారంభించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలన ఆసక్తిగా తిలకించారు. మండల విద్యాశాఖ అధికారిణి ఎం.వి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

నాసా ప్రాజెక్టులలో మాచర్ల శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ
మాచర్ల రూరల్ : నాసా ప్రకటించిన ప్రాజెక్టుల్లో మాచర్ల శ్రీ చైనత్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపాల్ అయ్యపరెడ్డి హరణి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించటం గర్వంగా ఉందన్నారు. అనంతరం శ్రీచైతన్య స్కూల్‌లో సైన్స్ డే నిర్వహించారు.



శాస్త్రవేత్తల చిత్రపటాలతో విద్యార్థులు







వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు

గడ్డ కట్టిన మంచులో.. 42 కిలోమీటర్లు

ప్రజాశక్తి - వినుకొండ
0.30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతంలో 42 కిలో మీటర్ల మారథాన్ పందెంలో విజయం సాధించడమే కాక.. పతకం దక్కించుకున్నారు గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన పరుగుల వీరుడు షేక్ అబ్దుల్లా. భారతదేశం నుంచి 80 మంది ఈ మారథాన్‌లో పాల్గొనగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వారిలో అబ్దుల్లా ఒకరు. గడ్డ కట్టిన మంచుపై 42 కిలోమీటర్లను ఆరు గంటల్లోపు పూర్తిచేసి పతకం సాధించారు. ఈ పోటీ కోసం భారత్- చైనా సరిహద్దు ప్రాంతమైన లడఖ్‌లోని ప్యాంగంగ్ చెరువు (మంచుపై) ఫిబ్రవరి 15 నుంచి 26వ తేదీ వరకు ఉండి, ఎంతో వ్యయ, ప్రయాసలకు ఓర్చి అబ్దుల్లా విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



తోటి క్రీడాకారులతో విజేతగా నిలిచిన అబ్దుల్లా

ఘనంగా దర్జీల దినోత్సవం



ప్రజాశక్తి- మాచర్ల
టైలర్స్‌డే పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మెడికల్ హాల్ అసోసియేషన్ భవనం వద్ద మాచర్ల పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన పలువురు టైలరింగ్ వృత్తిదారులను ఘనంగా సత్కరించారు. పఠాన్ నాగుల్ మీరా, పటాన్ నాగూర్ వలి ఆధ్వర్యంలో పఠాన్ బుడే సాహెబ్ స్మారక జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వినుకొండ : నియోజకవర్గ స్ఫూర్తి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏనుగుపాలెం రోడ్డులోని మార్కెట్ యార్డు వద్ద టైలర్స్ డే నిర్వహించారు. దర్జీ పతాక ఆవిష్కరణ చేపట్టారు. నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు కొణిజేటి నాగ శ్రీను రాయల్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బోయపాటి రామాంజనేయులు, టిడిపి పట్టణ అధ్యక్షులు పఠాన్ అయూబ్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ పరంగా వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పెదకూరపాడు : దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని పెదకూరపాడు మండల నేతాజీ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి కోరారు. టైలర్స్ డేను నిర్వహించారు. దర్జీల సమస్యలపై చర్చించారు.

కారంపూడి : కారంపూడి పట్టణంలోని టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా కుట్టు మిషన్ వ్యవస్థాపకులు విలియం హైవే చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. దర్జీల సమస్యలపై తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. మానసిక వికలాంగుల పాఠశాలలో పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



టైలర్స్ వేడుకలో దర్జీలు

ప్రజాశక్తి 7
గుంటూరు
శనివారం 1 మార్చి 2025

పట్టణంలో అభివృద్ధి పనులు సాగటం లేదు

-కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన
-ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్న చైర్‌పర్సన్


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ వెంకటేశ్వరరావు


చైర్ పర్సన్ రాధిక

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలో అభివృద్ధి పనులు సాగటం లేదని, కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలకు కూడా ప్రాధాన్యత లేకుండా పోయిందని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడి బోయిన రాధిక అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం జరిగింది. ఐదు అంశాలతో కూడిన అజెండా నిమిషాల్లోనే ఆమోదించినట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు. అయితే 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య లేచి పినపాడు పార్కులో ఎన్నికల కోడ్ రాకముందు ప్రారంభించిన పనులు ఎందుకు ఆపేశారని, పని ఎంతో అత్యవసరమని చెప్పినా అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్ పనితీరుపై విమర్శించారు. కమిషనర్ బి.శేషన్న జోక్యం చేసుకొని వివరణ ఇచ్చారు. సకాలంలో బిల్లులు రూపొందించటం లేదనే ఆరోపణలు రావటంతో కాంట్రాక్టర్‌లు, ఇంజనీరింగ్ అధికారులతో పలుమార్లు సమీక్ష జరిపామని, 67 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందన్నారు. కొద్దిరోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 22వ వార్డ్ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు మాట్లాడుతూ కబేళా వంతెన వద్ద ఉన్న పడమర కాల్వకు ఫెన్సింగ్ లేకపోవడం ప్రమాదకరంగా ఉందని, పెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.3లక్షలు 15 నెలల కిందట మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవటం ఏమిటని ప్రశ్నించారు. చినరావూరు తోట గేటు వద్ద వర్షాకాలంలో నీరు నిలుస్తోందని అక్కడ రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలో కోరామని 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత కౌన్సిల్ దష్టికి తెచ్చారు. ఇంజనీరింగ్ అధికారులు రోడ్డును సగంలో ఆపివేయడంతో ఉపయోగం లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇంచార్జ్ ఎంఈ శ్రీనివాసరావు వివరణ ఇస్తూ గతంలో రూ.10 లక్షలే కేటాయించడంతో రోడ్డు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదని చెప్పారు. మిగిలిన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. 4వ వార్డు, 26వ వార్డులలో కల్వర్టు నిర్మాణాలకు టెండర్లు పిలిచినా నేటికీ పనులు ప్రారంభించలేదని ఆయా వార్డుల కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్‌లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చి, పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 17వ వార్డ్ కౌన్సిలర్ అన్నం పిన్నారావు మాట్లాడుతూ పట్టణంలో రక్షిత మంచినీటి పథకం అస్తవ్యస్తంగా ఉందని, కుళాయి కనెక్షన్‌లు ఉన్నా కొందరికి నీరు రావడం లేదని, దానిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


వివిధ అంశాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నెహ్రూ నికేతన్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి తెనాలి

స్థానిక నెహ్రూ నికేతన్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. అడవుల సంరక్షణ, నీటిసంరక్షణ, అగ్ని పర్వ తాల నమూనా, సౌర కుటుంబం పాఠ్యాంశాలపై విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వివిధ అంశాలతో కూడిన ప్లకార్డులను పట్టుకొని ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి మాట్లాడుతూ విద్యార్థులు తెలుసుకున్న పాఠ్యాంశాలను ప్రదర్శనల ద్వారా వ్యక్తీకరించటం వారి మేథోశక్తికి అద్దం పడుతుందన్నారు చేస్తుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠ్యాంశాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శాస్త్రవేత్త కృషి ఫలితమే మానవుని మనుగడ

ప్రజాశక్తి - కొల్లిపర

శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే మానవుని మనుగడ సాధ్యమవుతోందని మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రాము సోమ రౌతు లక్ష్మీ కమల అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు విద్యార్థులు వివిధ ప్రయోగాలు, ప్రాజెక్టులతో ప్రదర్శన నిర్వహించారు ఇటువంటి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీస్తాయని వారిలో శాస్త్రీయ వైఖరిని పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు అన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి తెనాలి : గుంటూరుకు చెందిన ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ సహకారంతో డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రూరల్ గ్రామం కొలకలూరులో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. స్థానిక ఏబీఎం చర్చి వద్ద బాబు జగజ్జీవన్ రామ్ రీడింగ్ రూమ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్య శిబి రాన్ని లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ ప్రారంభిస్తారని, ప్రముఖ నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ మాధవీలత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్ళ జోళ్ళు పంపిణీ చేస్తారని వెల్లడించారు. శిబిరానికి హాజరయ్యే రోగులు ఆధార్ తెల్లరేషన్ కార్డుతో రావాల్సిందిగా నిర్వా హకులు కోరారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే సమాజం ముందడుగు

సైన్స్ ఎగ్జిబిషన్‌లో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి మంగళగిరి

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే సమాజం ముందడుగు వేస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్ స్మార్ట్ సిటీ డ్యాం డైజెస్టివ్ సిస్టం, హైడ్రో ఎలక్ట్రిసిటీ, బయోగ్యాస్ ప్లాంట్ యానిమల్ హాబిటేషన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ చూసి విద్యార్థుల ప్రతిభను ఆయన అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులను నిమ్మల రామా నాయుడు అభినందించారు. సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో మదర్ థెరిసా స్ఫూర్తితో స్కూల్‌ను ఏర్పాటు చేసి విద్యాభ్యాసం చేస్తున్నారని ఆయన అన్నారు. స్కూల్ ఆవరణ మంతా విజ్ఞానంతో వర్ధిల్లుతోందని మంత్రి నిమ్మల అన్నారు. అనంతరం స్కూల్ యాజమాన్యం మంత్రి నిమ్మల రామా నాయుడుని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ కె.వి ఫ్రాన్సిస్, ప్రిన్సిపాల్ కె.సభన ఫ్రాన్సిస్, వైస్ ప్రిన్సిపాల్ షేక్‌రజియా సుల్తానా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నిరంతర అధ్యయనం, వినూత్న ఆలోచనలతో సత్ఫలితాలు



పాత్రలో నీరుపెడుతున్న చిన్నారి, దాహం తీర్చుకుంటున్న పక్షులు

ప్రజాశక్తి తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మా-డి విద్యార్థుల ఫ్రెషర్స్ డే, ఫేర్ వెల్ డే వేడుకలు శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హెల్త్ హాస్పిటల్స్ సిఇఓ సిహెచ్ గిరిబాబు మాట్లాడుతూ సీనియర్, జూనియర్ల మధ్య హెచ్చుతగ్గులు లేకుండా ఆదర్శవంతమైన ఆత్మీయ భావంతో మెలిగేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతా యని అన్నారు. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను, తాము నేర్చిన పాఠ్యాంశాలను జూనియర్లతో పంచు కోవడం మంచి సంప్రదాయమని పేర్కొన్నారు. ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ నిరంతర అధ్యాయనం వినూత్న ఆలోచనలు ఉత్తమ ఫలితాలను ఇస్తాయన్నారు. సమాజంలోని రుగ్మతలకు దూరంగా, పలువురికి ఆదర్శంగా విలువలతో కూడిన జీవనవిధానం సాగించాలని కోరారు. ఫార్మసీ పూర్తి చేసుకుని విద్యార్థి దశ నుంచి సమా జంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో అధ్యాపకుల నుంచి గ్రహించిన విలువలు సోపానాలుగా మలచుకుని రాణించాలని కోరారు. ఫార్మా-డి హెచ్ఓడి డాక్టర్ టి జ్యోతి బసు, అధ్యాప కులు విద్యార్థులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ల్యాబ్ టెక్నీషియన్స్‌తో సమీక్ష

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లతో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి శుక్రవారం సమీక్ష జరిపారు. స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రక్తపూతల నమూనాలు సేకరించిన తదుపరి ఎప్పటికప్పుడు స్టెయిన్ చేసి వ్యాధి నిర్ధారణ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు రక్తపూతల సేకరణకు సంబంధించిన వివరాలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్.ఉమాకాంత్, ఎం. బాల చంద్రమౌళి, జి రవికుమార్, డి శ్రీనివాసరావు, బి.మల్లేశ్వరరావు, షేక్ రషీద్, షేక్ నవీద్, డి. శ్రీనివాసరావు, శరత్, వేణుగోపాల్ కరిముల్లా, ల్యాబ్ టెక్నీషియన్లు రాఘవరెడ్డి, సుధీర్, కమలాకర్ గుప్తా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

దుర్వినియోగానికి పాల్పడిన అధికార పార్టీ

ప్రజాశక్తి- పెదకాకాని

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ తమ అభ్యర్థి గెలుపు కోసం అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు నన్నపనేని శివాజి అన్నారు. తక్షణమే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రశాంతంగా జరగవలసిన ఎన్నికలు అధికారులను ఓటర్ల ప్రలోభాలకు గురిచేసి మాటవినని వారిపై దౌర్జన్యాలకు తెగబడ్డారన్నారు. అభివృద్ధి చేయకపోగా ప్రజా వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకు ఎమ్మెల్యేలు సైతం అధికారులను బెదిరిం చారన్నారు. రిగ్గింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాల్లో సిసి టివి పుటేజ్ తీయించి బాధ్యులపై ఎన్నికల కమిషన్ సత్వరమే చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. రిగ్గింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాల లో తిరిగి పోలింగ్ జరిపి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని శివాజి కోరారు.


పాత కరెన్సీని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

సృజనాత్మకతకు వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు

ప్రజాశక్తి - తుళ్లూరు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయని స్థానిక కెవిఆర్ జెడ్పి హైస్కూల్ హెచ్ఎం జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్, పాత కరెన్సీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సర్ సి.వి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్, సైన్స్ ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాతకరెన్సీ సేకరించిన విశ్రాంత ఉపాధ్యాయులు మామిళ్ల కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

నగరంలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా పలు చోట్ల సైన్స్ ప్రదర్శనలు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిం చారు.







సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో..: స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న పరీక్షా భవన్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్, ఎపి కాస్ట్ విజయవాడ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు సీనియర్, జూనియర్ విభాగాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి జి.ఏసు రత్నం పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి షేక్.గౌసుల్ మీరా, ఉర్దూ డిఐ ఖాసిం, ఎంఇఒ రమణయ్య, హెచ్‌ఎం వసుంధర తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో..: వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నేషనల్ సైన్స్‌డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్ర మాన్ని 'సైన్స్ ఇన్ 21 ఫస్ట్ సెంచురీ: రీడిఫైనింగ్ ద హారిజన్స్ ఆఫ్ ఫ్యూచర్ ' అనే ఇతివత్తంతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ మెటీరియల్స్ టెస్టింగ్ గ్రూప్ హెడ్, సైంటిస్ట్ కే.సోమశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు, మెమోంటోలు అందజేసారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



గీతాంజలి హైస్కూల్లో..: సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఏటిగ్రహారం, రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్‌డే సందర్భంగా సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ షేక్. హుస్సేన్ రామన్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం షేక్. షంషాద్‌భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంవిఎస్ కోటేశ్వరరావు స్కూల్లో..: స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మోమోరిల్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సైన్స్ ఉపాధ్యాయులు, జెవివి రాష్ట్ర నాయకులు ఎస్.శివనాగేశ్వరరావు ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను పరిశీలించి అభినందించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పలు రకాల నమూనాలు, చార్టులు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.తాండకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.డి.ఎన్.దివ్య, ఎగ్జిబిషన్ నిర్వాహకులు సైన్స్ టీచర్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.



సెయింట్‌ఆన్స్‌లో: గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో నిర్వహించిన జాతయీ సైన్స్‌డే సందర్భంగా కెమిస్ట్రీ, బోటనీ విద్యార్థులు నమూనాలు, పోస్టర్లను ప్రదర్శించారు.డిటర్జంట్, ఇతర పదార్థాలు ప్రత్యక్షంగా తయారు చేసి, వివరించారు. వస్త్రాలపై వేసే రంగులు, జూండూబామ్, డిటర్జంట్ ఇతర పదార్థాలు ప్రత్యక్షంగా చేసి వివరించారు. బోటనీ విద్యార్థులు గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, ఫోటో సింథసిస్, వాతావరణ మార్పులు మోడళ్లను వివరించారు. ప్రదర్శన శాలను ప్రిన్సిపాల్ సంధ్య ప్రారంభించారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ విద్యార్థులు నిర్మల్ హృదయ్‌లోని రోగ పీడితులు, అనాధ శరణాలయానికి వెళ్ళి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



చలపతి ఫార్మసీ కాలేజీలో.. చలపతి ఫార్మసీ కళాశాల, చలపతి పూర్వ విద్యార్థుల సంఘం, సిఎల్‌పిటి ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ సెల్ సహకారంతో నేషనల్ సైన్స్‌డే సందర్భంగా 'ట్రాన్సఫార్మింగ్ ఐడియాస్ ఇన్ టూ రియాలిటీ : పయనీరింగ్ ఇన్నోవేషన్ ఫర్ హెల్త్' అను అంశంపై 'ఐడియాథాన్' నిర్వహించారు. కార్యక్ర మంలో మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, గుంటూరు ఆప్టిక్ థర్డ్ ఐ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు, సిఇఒ జె.సంతోష్ పాల్గొని ప్రసంగించారు. చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఐదు ఉత్తమ ఆలోచనలకు నగదు బహుమతి అందజేశారు.



శ్రీచైతన్య పాఠశాలలో..: స్థానిక శ్యామలా నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో అలరించింది. విద్యార్థులు 500 రకాల ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ఆయుష్మాన్ హాస్పిటల్ పిల్లల వైద్యులు డాక్టర్ రాకేష్‌బాబు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.అరుణకుమారి, ఏజిఎం నూతలపాటి అంజయ్య, కోఆర్డినేటర్ సచ్చిదానందమూర్తి, ఏఒ శివకుమార్, డీన్ శిప్రసాద్ పాల్గొన్నారు.

సుమేధా హైస్కూల్లో.. స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ కార్నివాల్ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మల్లేశ్వరి కార్నివాల్‌ను ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెఎల్‌పి స్కూల్లో.. స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పీడియాగోగి ఆఫ్ ఫిజికల్ సైన్సెస్ అధ్యాపకురాలు డాక్టర్ జి.వి.శివలక్ష్మి, పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఏఒ వెంకట్రావ్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ బి.శైలజ పాల్గొని సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 280కిపైగా సైన్స్ నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు.



కన్న హైస్కూల్లో.. స్థానిక రైలు పేటలోని కన్నా హైస్కూల్లో సర్ సివి రామన్ జయంతిని పురస్క రించు కొని 'జాతీయ సైన్స్ దినోత్సవం' ఘనంగా నిర్వహి ంచారు. రామన్ చిత్రపటానికి స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన భౌతిక, రసాయక, వక్ష, మానవ, జీవశాస్త్రాల ప్రదర్శన ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టిజెపిఎస్ కాలేజీలో.. స్థానిక టిజెపిఎస్ కాలేజిలో సైన్స్‌డేని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎం ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తత్వం, పోస్టర్ ప్రెజంటేషన్ వంటి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, భౌతిక, రసాయన శాస్త్ర విభాగాదిపతులు ఎం.రేణుక, ఎంఎల్‌ఎన్ రాజగోపాల్ పాల్గొన్నారు.



(ప్రజాశక్తి- గుంటూరు)

ఆర్‌విఆర్ అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.పురుషోత్తమ కార్తీక్‌కు అన్నామలై యూనివర్సిటీ, తమిళనాడు డాక్టరేట్ ప్రదానం చేసింది. కార్తీక్ 'ఆప్టిమైజేషన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ ఓవరాల్ హీట్ ట్రాన్స్‌ఫర్ కొహిషన్ అండ్ సిహెచ్.వాల్యూ ఆఫ్ కోల్ వాటర్ స్లర్రీ విత్ డిఫరెంట్ ఇమ్బ్లర్స్ యూజింగ్ ఏజిటేషన్ వెస్సల్ ఎక్విప్‌మెంట్' అనే అంశంపై పరిశోధన చేశారు. అన్నామలై యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సిఎం.రఘురామన్, ఆర్‌విఆర్ జెసికి చెందిన డాక్టర్ సి.తారాశశంక్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్‌కు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

బ్యాలెట్ బాక్స్‌లకు పటిష్ట భద్రత : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లకు పటిష్టమైన భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను గురువారం రాత్రి అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నిక బ్యాలెట్ బాక్స్‌ల స్వీకరణ కేంద్రంలోని సిబ్బంది బాక్స్‌లకు ఉన్న సీళ్లను తీసుకునే సమయంలో నిశితంగా పరిశీలించాలని అనంతరం స్ట్రాంగ్ రూమ్ సిబ్బంది వాటిని నిర్దేశించిన ప్రదేశంలో చేర్చాలన్నారు. బ్యాలెట్ బాక్సులు అందించేందుకు పోలింగ్ స్టేషన్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, కౌంటర్లలో సిబ్బంది వారికి కేటాయించిన బ్యాలెట్ బాక్సులను మాత్రమే తీసుకోవా లన్నారు. ఇందు కోసం హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశామన్నారు. బ్యాలెట్ బాక్సుల స్వీకరణ కేంద్రంలో సిబ్బ ందికి మౌలిక సదు పాయాలు కల్పించాలన్నారు.



ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ వద్ద పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు తదితరులు

లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు బలోపేతం కావాలి

ప్రజాశక్తి-గుంటూరు : విముక్తి కోసం దళితులు, మైనార్టీలు, స్త్రీలు, ఇతర బాధితులు చేపట్టే అన్ని ఉద్యమాల్లోనూ అభ్యుదయ రచయితలు కలిసి ఉన్నారని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. డాక్టర్ కోయి కోటేశ్వరరావు కవితా సంపుటి 'నాగస్వరం' పుస్తకావిష్కరణ సభ స్థానిక బ్రాపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో మంచి పుస్తకం, జాషువా కల్చరల్ సెంటర్, భీమ్ సేన్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎవరు ఏం తినాలో, ఏం బట్టలు కట్టుకోవాలో, ఏ పుస్తకం చదవాలో శాసించే స్థాయికి నేటి హిందూ మతోన్మాద పాలకపక్షం చేరిందన్నారు. ఈ సమయంలో లౌకికవాద, ప్రజాస్వామ్య శక్తులు బలపడే ప్రయత్నాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభకు ఏసీ కాలేజి పూర్వ ప్రిన్సిపాల్ పి.ముత్యం అధ్యక్షత వహించగా, ప్రముఖ సాహితీవేత్తలు గుంటూరు లక్ష్మీనర్సయ్య, ఎస్.బాలస్వామి, ఎన్.జె. విద్యాసాగర్, పల్నాటి శ్రీరాములు, డాక్టర్ కాకాని సుధాకర్, శశిధర్, డాక్టర్ చుక్కా నాగభూషణం, కాపు శ్రీనివాస్, ప్రజాగాయకుడు పి.వి.రమణ, ఎన్.నీలాంబరం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ